శివకోటిలో భారీ చోరీ

రూ.20 లక్షల సొత్తు అపహరణ

వార్త 7లో

రాజేష్‌ను మార్చాల్సిందే



నేతల తీర్మానం

పి.గన్నవరం, మార్చి 2: పి.గన్నవరం నియోజకవర్గ టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా అధిష్ఠానం ప్రకటించిన మహాసేన రాజేష్ (టీడీపీ) అభ్యర్థిత్వాన్ని ఏకగ్రీవంగా వ్యతిరేకిస్తున్నట్లు పి.గన్నవరం మండల టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రకటించారు. లంకలగన్నవరంలో ఆయా పార్టీల మండల అధ్యక్షులు తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఉమ్మడి మండల సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసినట్లు చెప్పారు. అధిష్ఠానం పునరాలోచించాలని సూచించారు. పి.గన్నవరంలో ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీయే రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని పలువురు నాయకులు స్పష్టం చేశారు. దానికి అనుగుణంగానే గెలిచే అభ్యర్థికే సీటు కేటాయించాలని కోరారు. రాజేష్‌ను మినహాయించి పార్టీ ఏ అభ్యర్థిని ప్రకటించినా నాయకులు, కార్యకర్తలు కష్టపడి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, యల్లమిల్లి కృష్ణవేణి, బొండాడ నాగమణి, నక్కా సత్యనారాయణ, పాలూరి వీరభద్రం, ఆదిమూలం సూరయ్యకాపు, శేరు శ్రీనుబాబు, అంబటి కోటేశ్వరరావు, యడ్ల ఏసు, తాటికాయల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విజయావకాశాలపై ప్రభావం

అంబాజీపేట నాయకులు

అంబాజీపేట, మార్చి 2: పి.గన్నవరం ఎస్సీ రిజర్వ్‌డ్ అసెంబ్లీ స్థానాన్ని సరిపెల్ల రాజేష్(మహాసేన రాజేష్)కు ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని టీడీపీ, జనసేన నాయకులు తెలిపారు. అంబాజీపేటలో టీడీపీ, జనసేన పార్టీ మండల నాయకులు గుడాల ఫణి, దొమ్మేటి సాయికృష్ణ అధ్యక్షతన మండల విస్తృత స్థాయి సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గం గురించి తెలియని వ్యక్తికి టిక్కెట్ కేటాయించడం దారుణమన్నారు. రాజేష్‌కు సీటు కేటాయిస్తే అది అసెంబ్లీను, పార్లమెంట్‌లోను పార్టీ విజయావకాశాలపై ప్రభావం చూపుతుందన్నారు. ఈ విషయాన్ని టీడీపీ, జనసేన పార్టీ అధినేతలు పునరాలోచించి పి.గన్నవరం ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాన్ని స్థానికులకు కేటాయించాలని కోరారు. నాయకుల నిర్ణయాన్ని పరిగణలోకి తీసుకుని పార్టీ అధిష్ఠానం తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. స్థానికుడిగా ఈ ప్రాంతంలో ఉండి గత ఇరవై ఏళ్లుగా పార్టీకి సేవలందించిన తనకు పార్టీ టిక్కెట్టు కేటాయించాలని ఎస్సీ సెల్ నాయకుడు నాగాబత్తుల వెంకటసుబ్బారావు సమావేశంలో కోరారు. జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి వీరవెంకట సత్యనారాయణ, నాయకులు గణపతి వీరరాఘవులు, పితాని రామకృష్ణ, బొంతు పెదబాబు, వాకపల్లి దొరబాబు, అరిగెల సూరిబాబు, నేదునూరి పెద్దిరాజు, అరిగెల బలరామ్మూర్తి, గోడా సత్యనారాయణ, మందా రాజేష్, కొర్లపాటి డిల్లీ సర్పంచ్‌లు నాగాబత్తుల శాంతకుమారి, జల్లి బాలరాజు, ఎంపీటీసీలు, టీడీపీ, జనసేన నాయకులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

కూటమి కోసం నేనే తప్పుకుంటా!

"సీటు ప్రకటించిన దగ్గర నుంచి జగన్ రెడ్డి కుట్రలు, కుతంత్రాలకు తెరతీశారు. తప్పుడు ప్రచారాలు మొదలుపెట్టారు. సామాన్యుడిపై కుటిల రాజకీయ యుద్ధం ప్రకటించారు. నన్ను అడ్డం పెట్టుకుని టీడీపీ, జనసేన కూటమిని దెబ్బతీయాలనే ప్లాన్ వేశారు. అందుకే కూటమి నష్టపోకుండా నేనే స్వచ్ఛందంగా తప్పుకుంటా..

మహాసేన రాజేష్

పి.గన్నవరం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గ టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి సరిపెల్ల రాజేష్ అలియాస్ మహాసేన రాజేష్ ఎన్నికల బరి నుంచి స్వచ్ఛందంగా నిష్క్రమిస్తున్నట్లు చేసిన ప్రకటన రాజకీయంగా చర్చనీయాంశమైంది. టీడీపీ, జనసేన అధినేతలు ఇటీవల ప్రకటించిన తొలి జాబితాలో సోషల్ మీడియాలో ఇటీవల కాలంలో బాగా పాపులర్ అయిన సరిపెల్ల రాజేష్ పేరును పి.గన్నవరం స్థానానికి ఖరారు చేశారు. అయితే ఆయన పేరును ప్రకటించిన తర్వాత గన్నవరం నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు ఆయనకు వ్యతిరేకంగా మారిపోయాయి.



రాజేష్ చుట్టూ రాజకీయం

- పి.గన్నవరంలో రాజుకున్న రాజకీయాలు
- రెండు మండలాల్లో రాజేష్‌కు వ్యతిరేకంగా టీడీపీ-జనసేనల తీర్మానాలు
- యనమల, రాజప్పలకు ఫిర్యాదు
- అభ్యర్థిని మార్చాలని డిమాండ్
- పార్టీ నిర్ణయం కోసం ఎదురుచూపులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసైనికులు గతంలో రాజేష్ సోషల్ మీడియాలో కులాలకు, మతాలకు, పార్టీలకు వ్యతిరేకంగా చేసిన వీడియోలను ఇప్పుడు వెలుగులోకి తెచ్చి తీవ్రంగా ట్రోల్ చేశారు. దీంతో ఇరు పార్టీల కేడర్ రాజేష్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ బహిరంగంగా ఆందోళనకు దిగాయి. అంబాజీపేటలో జరిగిన టీడీపీ సమన్వయ భేటీలో రసాభాస సృష్టించి, కుర్చీలు ధ్వంసం చేసి గంటి హరీష్‌మాధుర్‌కు చెందిన కారుఅద్దాలు పగలకొట్టారు. రాజేష్ అభ్యర్థిత్వాన్ని మార్చు చేయాలంటూ పట్టుబట్టారు. చివరకు ఇరు పార్టీల అధినేతలకు తమ గోడును వెల్లగక్కారు. అయినప్పటికీ సరిపెల్ల రాజేష్ అయినవిల్లిలోని వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అక్కడి నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అయితే ఆ కార్యక్రమానికి ఇరుపార్టీలకు చెందిన కీలక శ్రేణులు దూరంగా ఉన్నాయి. ఆ తర్వాత విశాఖపట్నంలో మహాసేన రాజేష్‌కు వ్యతిరేకంగా బ్రాహ్మణులు టీడీపీ కార్యాలయాన్ని ముట్టడించి చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలిచ్చి హిందూ వ్యతిరేక పార్టీ టీడీపీ అంటూ వారు చేసిన దుష్ప్రచారంతో రాజేష్ తీవ్ర మనస్తాపం చెందారు. బీజేపీ నేతలు ఎప్పుడో ఏడేళ్ల క్రితం హిందువులకు వ్యతిరేకంగా చేసిన వీడియోను వెలుగులోకి తెచ్చి తనపై బురదజల్లి టీడీపీ-జనసేన ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారనే ఆవేదనతో మహాసేన రాజేష్ పి.గన్నవరం పోటీ నుంచి నిష్క్రమిస్తున్నట్టు ప్రకటించారు. సామాన్యుడినైన తనకు టిక్కెట్ ఇస్తే సీఎం జగన్ కుట్రలు పన్ని, కొన్ని వీడియోలు వెలుగులోకి తెచ్చి, కులాలు మతాల మధ్య చిచ్చుపెట్టే విధంగా చేస్తూ రాజకీయ పబ్బం గడపడానికి ప్రయత్నిస్తున్నారని రాజేష్ ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమికి 142 స్థానాలు వస్తాయనేది సర్వేలు చెబుతున్నాయని, అటువంటి పార్టీకి తన కారణంగా ఏ చిన్న సమస్య ఉత్పన్నం కాకూడదనే ఉద్దేశంతో పి.గన్నవరం అభ్యర్థిత్వం నుంచి వైదొలగేందుకు నిర్ణయించుకున్నట్టు ఆయన ప్రకటన చేశారు. తాను స్వచ్ఛందంగా తప్పుకోవడం వల్ల ఎటువంటి సమస్యలు ఉండవని, ఒకవేళ పార్టీ తప్పిస్తున్నట్టు ప్రకటిస్తే దళితులు, ఇతరులు ఆందోళన చెందుతారని, దాని వల్ల టీడీపీకి నష్టం కలుగుతుందనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించారు.

వ్యతిరేకంగా తీర్మానాలు



పి.గన్నవరంలో సమావేశమైన వ్యతిరేక వర్గం

శనివారం పి.గన్నవరం, అంబాజీపేటల్లో జరిగిన మండల టీడీపీ, జనసేన సంయుక్త సమావేశాల్లో మహాసేన రాజేష్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేస్తూ నిర్ణయం తీసుకున్నాయి. కాగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప తదితరులు శనివారం సతీవియోగంతో బాధపడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబును పరామర్శించేందుకు కోనసీమ వచ్చారు. వారిని పాశర్లపూడి వద్ద టీడీపీ, జనసైనికులు కలిసి మహాసేన రాజేష్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ అభ్యర్థిని మార్చాలని డిమాండు చేశారు. దాంతో వారు సమస్యను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇవ్వంతో పాటు రాజేష్ సోషల్ మీడియాలో చేసిన ప్రకటనను సైతం ఉటంకిస్తూ వారిని బుజ్జగించారు. దాంతో వారు శాంతించారు. రాజేష్ నిష్క్రమణపై పార్టీ అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుంటుందోనన్న చర్చ టీడీపీ, జనసేనల్లో నెలకొంది.

వృథా నీటికి అడ్డుకట్ట వేసి

శివారు చేలకు నీరు

కలెక్టర్ హిమాన్షుశుక్లా



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

అమలాపురం టౌన్, మార్చి 2: జిల్లాలో దాళ్వా వరి సాగులో భాగంగా డ్రెయిన్లలో వృథాగా పోయే నీటికి అడ్డుకట్టలు వేసి శివారు ప్రాంతాల్లోని పంట చేలకు పూర్తిస్థాయిలో నీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవడంలో భాగంగా డ్రెయిన్లపై క్రాస్‌బండ్ల నిర్మాణానికి, ఇంజన్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదిక అందించామని కలెక్టర్ హిమాన్షుశుక్లా చెప్పారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే క్రాస్ బండ్లు ఏర్పాటు చేస్తామన్నారు. కలెక్టరేట్‌లో శనివారం జరిగిన వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న అనంతరం కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 6న ఉదయం 7 గంటల నుంచి జిల్లాలోని అన్ని ఓవర్ హెడ్ ట్యాంకులను ఒకేసారి శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టామన్నారు. ఫొటోతో కూడిన ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు త్వరితగతిన పంపిణీ చేయాలన్నారు. ఈ నెల 16న నేషనల్ ఇమ్యునైజేషన్ డేను పురస్కరించుకుని ఈ నెల 3న జిల్లా అంతటా ఐదేళ్లలోపు పిల్లలకు ఓరల్ పోలియో వ్యాక్సిన్ వేసే కార్యక్రమం చేపట్టామని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ఈ కె.చంటిబాబు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, సీపీవో వెంకటేశ్వర్లు, నోడల్ అధికారి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ దళిత వ్యతిరేక ప్రభుత్వమని చెప్పి

ఇప్పుడు ఎలా చేరారు?

మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావుకు టీడీపీ నేత హరీష్‌మాధుర్ సూటిప్రశ్న

అంతర్వేది, మార్చి 2: వైసీపీ దళిత వ్యతిరేక ప్రభుత్వమని రోజూ ఊదరగొట్టే గొల్లపల్లి సూర్యారావు వైసీపీ పార్టీలో ఎలా చేరారని టీడీపీ నేత హరీష్‌మాధుర్ ప్రశ్నించారు. సఖినేటిపల్లి మండలాధ్యక్షుడు ముప్పర్తి నాని అధ్యక్షతన జరిగిన సఖినేటిపల్లి మండల స్థాయి టీడీపీ సమావేశానికి హరీష్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా హరీష్‌మాధుర్, తెలుగుదేశం పార్టీ నాయకులు అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హరీష్‌మాధుర్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా వైసీపీ దళిత వ్యతిరేక ప్రభుత్వమని టీడీపీ ప్రవేశపెట్టిన 27 పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దుచేసిందని, అనేక మంది దళిత సోదరుల మరణాలకు వైసీపీ ప్రభుత్వ విధానాలనే కారణమని విమర్శించిన గొల్లపల్లి ఈరోజు వైసీపీ ప్రభుత్వంలో చేరి తెలుగుదేశం పార్టీపై అనేక విమర్శలు చేయడం ప్రజల్లోను, దళిత సమాజంలోను గొల్లపల్లిని చులకన చేస్తున్నాయన్నారు. ఆర్థిక ప్రయోజనాల కోసం వైసీపీలోకి వెళ్లి చంద్రబాబు, లోకేశ్‌ను విమర్శిస్తుంటే ప్రజలు ఛీకొడుతున్నారని అన్నారు. ఇకనైనా స్వార్థ ప్రయోజనాలను వీడి జాతి ప్రయోజనాల కోసం పనిచేయాలని గొల్లపల్లికి హరీష్‌మాధుర్ హితవు పలికారు. టీడీపీ కార్యకర్తలంతా ఒకే తాటిపై ఉన్నారని, ప్రతీ ఒక్కరూ వైసీపీ పార్టీలోకి వెళ్లిన గొల్లపల్లి సూర్యారావును ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇకనైనా చౌకబారు ప్రకటనలు మాని తన పని తాను చేసుకోవాలని గొల్లపల్లికి సూచించారు. కార్యక్రమంలో శాసనమండలి మాజీ సభ్యుడు రుద్రరాజు పద్మరాజు, రుద్రరాజు వెంకట్రామరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి చిటికెల రామ్మోహనరావు, బోళ్ల సతీష్, పోతురాజు కృష్ణ, మంగెన భూదేవి, బందెల పద్మ, చాగంటి స్వామి, తిరుమాని ఆచార్యులు, పిండి సత్యనారాయణ, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వార్త 7లో

వాసాలతిప్ప తీరంలో బోటు బోల్తా మత్స్యకారుడి మృతి



పచ్చదనం కరువై కళావిహీనంగా పరిసరాలు



ప్రాంగణంలో వెలసిన పుట్టలు



నిర్జీవంగా ఉన్న పరిసరాలు



నిర్లక్ష్యం నీడలో

●(అమలాపురం టౌన్)

- అభివృద్ధికి దూరంగా బాలయోగి ఘాట్
- పుట్టలు, తుప్పలతో అధ్వానంగా పరిసరాలు
- పనిచేయని ఫౌంటెన్లు
- కానరాని పచ్చదనం
- పట్టించుకునేవారేరి?

కోనసీమ భవిష్యత్తులో ఎలా ఉండబోతుందో ముందే ఊహించి ప్రణాళికలు రచించిన విజనరీ దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి. కోనసీమ ఖ్యాతిని ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తుల్లో మొదటి వరుసలో ఆయన ఉంటారు. కోనసీమలో నేటికీ ప్రతి ఊరు ఏదో ఒక సందర్భంలో ఆయన పేరును తలుచుకుంటుందనడంలో ఎటువంటి అతిశయోక్తి కాదు. అలాంటి సేవాతత్పరుడి స్మారకార్థం ప్రభుత్వ పరంగా నిర్మించిన బాలయోగి ఘాట్ నేడు నిర్లక్ష్యానికి గురయ్యింది. పాముల పుట్టలతో, చెత్తాచెదారంతో నిండిపోయింది. ఎంతో ఆహ్లాదకరంగా నిర్మించిన ఘాట్ ప్రాంగణం పూర్తిగా ప్రాభవాన్ని కోల్పోయి పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది.

దశాబ్దాలు గడిచిపోతున్నా..

దశాబ్దాలు గడిచిపోతున్నా బాలయోగి ఘాట్‌కు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు, ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు నాయకులెవరు ముందుకు రాకపోవడం శోచనీయం. ఆయనే బతికుంటే కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ ఎప్పుడో పూర్తయి ఉండేదని ఇక్కడ వారు తరచూ అనే మాట. బాలయోగి స్మారకార్థం అమలాపురం నల్లవంతెన దిగువన నిర్మించిన ఘాట్‌ను 2012 సెప్టెంబరు 16న అప్పటి కాంగ్రెస్ ఎంపీ జీవీ హర్షకుమార్ కృషి ఫలితంగా కేంద్ర మంత్రులు మల్లికార్జున ఖర్గే, పనబాక లక్ష్మి ప్రారంభించారు. నాడు పచ్చదనంతో, విద్యుత్ దీపాలంకరణలతో కళకళలాడుతూ ఫౌంటెయిన్లతో ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దారు. నేడు ఆ ప్రాంగణంలో పచ్చదనం జాడే లేదు. విద్యుత్ వెలుగులు లేవు. ఫౌంటెయిన్లు లేవు. అభివృద్ధికి చిరునామాగా నిలిచిన బాలయోగి పేరిట నిర్మించిన ఘాట్‌లో నాటి అభివృద్ధి పూర్తిగా కనుమరుగైంది. సుందర వనంలా కళకళలాడిన ఆ ప్రాంగణం నేడు పాముల పుట్టలతో దర్శనమిస్తోంది. ఇక ఫౌంటెయిన్ల కోసం నిర్మించిన తొట్టెల్లో నిలిచిపోయిన వర్షపునీరు తెట్టుగా తేలి దుర్వాసన వెదజల్లుతోంది. పచ్చదనం లేక ఆ ప్రాంగణం మోడు బారిపోయి దర్శనమిస్తోంది.



ఒకప్పుడు పచ్చదనంతో ఇలా(ఫైల్)

నేడు మెగా వైద్య శిబిరం

బాలయోగి వర్ధంతిని పురస్కరించుకుని టీడీపీ అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి హరీశ్‌మాధుర్ ఆధ్వర్యంలో బాలయోగి ఘాట్‌లో ఆదివారం మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కేన్సర్ నిర్ధారణ పరీక్షలతో పాటు స్త్రీలకు గర్భాశయ పరీక్ష, రొమ్ము పరీక్ష, స్త్రీ, పురుషులకు ఉదర పరీక్ష, ఊపిరితిత్తుల పరీక్షలు, కంటి, పంటి పరీక్షలు, చెవి, ముక్కు, గొంతు పరీక్షలతో పాటు ఎకో, ఈసీజీ వంటి పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు హరీశ్ మాధుర్ తెలిపారు.

నేడు బాలయోగి వర్ధంతి

దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి 22వ వర్ధంతిని పురస్కరించుకుని అమలాపురంలోని బాలయోగి స్మారక చిహ్నం వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. బాలయోగి తనయుడు గంటి హరీశ్‌మాధుర్ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాలను తెలుగుదేశం పార్టీ నాయకులు నిర్వహించనున్నారు. సరిగ్గా 22 ఏళ్ల క్రితం కృష్ణా జిల్లా కొవ్వాడలంక వద్ద హెలికాప్టర్ ప్రమాద ఘటనలో బాలయోగి మరణించారు. ఆయన స్మారక చిహ్నాలుగా అమలాపురంలోని నల్లవంతెన సమీపాన బాలయోగి ఘాట్, మినీ స్టేడియంలను ఏర్పాటు చేశారు. గత దశాబ్ద కాలం పైనుంచి వర్ధంతి రోజునో, జయంతి రోజునో మాత్రమే బాలయోగి ఘాట్ గేట్లు తెరవడం ఆనవాయితీగా మారింది. కొన్ని గంటల తర్వాత మళ్లీ మూసేస్తారు. బాలయోగి వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం ఉదయం 7 గంటలకు ఎదుర్లంక-యానాం బ్రిడ్జి వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం 8.30 గంటలకు బాలయోగి ఘాట్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని బాలయోగి తనయుడు హరీశ్‌మాధుర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఘాట్ వద్ద వర్ధంతి కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

హత్యా రాజకీయాలకు
కేరాఫ్ అడ్రస్ వైసీపీ

- రూరల్‌లో మంత్రి అరాచకాలకు అంతంలేదు
- రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఫైర్



రాజమహేంద్రవరం రూరల్, మార్చి 2: రాష్ట్రంలో అధికార వైసీపీ హత్యారాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని టీడీపీ సీనియర్ నేత రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరంలోని తన నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వాధికారులను భయభ్రాంతులకు గురిచేస్తూ తప్పుడు విధానాల్లో ఎన్నికల్లో గెలవాలనుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల నుంచి దోచుకున్న సొమ్మును ప్రచార ఆర్భాటానికి ఫ్లెక్సీలకు ఉపయోగిస్తున్నారని, వలంటీర్ల వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ దొంగ ఓట్లను చేర్చాలని అధికారులు ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. ముఖ్యంగా రాజమహేంద్రవరం రూరల్‌లో మంత్రిగారి అరాచకాలకు అంతంలేకుండా పోయిందన్నారు. పంచాయతీ నిధులను ఫ్లెక్సీ ప్రచారాలకు వినియోగిస్తున్నారని మండిపడ్డారు. అంగన్వాడీలు, ఆశ వర్కర్లకు బహుమతులు ఇస్తూ అధికార దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రభుత్వ ఆస్తులను కొంత మంది ప్రైవేట్ వ్యక్తులకు కేటాయిస్తున్నారన్నారు. రాజమహేంద్రవరం కేంద్రంగా ఇసుక మాఫియా జగన్ రెడ్డి నడిపిస్తున్నాడని చెప్పారు. రోజుకు ఇసుకపై రూ.2 కోట్లు పైగా సొమ్ము దోచుకుంటున్నారని ఎన్‌జీటీ ఆదేశాలను కూడా ఇసుక మాఫియా లెక్కచేయడం లేదన్నారు. వైఎస్ వివేకానందరెడ్డిని జగన్‌రెడ్డి ముఠానే హతమార్చిందన్నారు. సీబీఐ విచారణ పిటిషన్ వేస్తానని సునీతమ్మ అంటే జగన్ ఎందుకు ఆపారని ,తొలుత విచారణకోరి అటుపై ఎందుకు ఆపారో జగన్ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. సీఎంగా ఉండే అర్హత జగన్‌కు లేదన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏడువారాల వెంకన్న గోవిందా...గోవిందా





ప్రత్యేక అలంకరణలో ఆత్రేయపురం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం, మార్చి 2: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తజనంతో శోభిల్లింది. వేకుమజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం, తదితర కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల సుంగద పరిమాలలు వెదజల్లే ఫలపుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామివారి తీరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని తలనీలాలు, తులాభారాలు, కానుకలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గోవిందనామస్మరణతో అశేషభక్తజనం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. 35వేల నుంచి 40వేల మంది భక్తులు భారీ కూలైన్ల ద్వారా గంటల తరబడి వేచియున్న భక్తులు స్వామివారిని దర్శించుకుని మంత్రముగ్ధులయ్యారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. వివిధ సేవలద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.42.39 లక్షలు లభించినట్టు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, కార్యనిర్వాహకాధికారి, భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల యూనిఫామ్ రద్దుకు కృషి



సచివాలయ ఉద్యోగుల జిల్లా కమిటీకి సభ్యులకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి

అమలాపురం టౌన్, మార్చి 2: సచివాలయ ఉద్యోగుల యూనిఫామ్స్ రద్దుకు కృషి చేస్తున్నట్టు ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. అమలాపురం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జిల్లాశాఖ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులతో నియమించబడ్డ మహిళా పోలీసుల పదోన్నతులు, జాబ్ చార్ట్ కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డిని డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, రెవెన్యూ జేఏసీ రాష్ట్ర చైర్మన్ వాసా ఎస్.దివాకర్, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, కుడుపూడి బాబులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం జిల్లాశాఖ నూతన కార్యవర్గాన్ని ఆయన ప్రకటించి నియామక ఉత్తర్వులు అందజేశారు. జిల్లాశాఖ అధ్యక్షుడిగా జగడం కిరణ్, ప్రధాన కార్యదర్శిగా మట్టపర్తి సముద్రం, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా స్వామి, కృష్ణకుమారి, ఉపాధ్యక్షులుగా సవరపు రాజకుమారి, ప్రసాద్, ఎన్వీఎస్ఆర్ లక్ష్మి, చెల్లి నాగేంద్రకుమార్, కోశాధికారిగా ఎస్.శేషగిరితో పాటు కార్యవర్గ సభ్యులను ప్రకటించి నియామక ఉత్తర్వులను అందజేశారు.

సత్యదేవుడికి వెండి,బంగారు వస్తువుల అందజేత



ఈవోకు వెండి బకెట్, స్వామివారికి స్వర్ణ నేత్రాలు, కనుబొమ్మలు, మీసాలు అందజేస్తున్న పురోహితులు

అన్నవరం, మార్చి 2: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం అన్నవరం దేవస్థానం వ్రతపురోహితులు సుమారు 1.75లక్షల విలువైన వెండి బకెట్, స్వామివారికి బంగారు నేత్రాలు, కనుబొమ్మలు, మీశాలను అందజేశారు. వీటిని ఈవో రామచంద్రమోహన్‌కు సంఘ ప్రతినిదులు ఈవో రామచంద్రమోహన్‌కు అందజేశారు. ఈసందర్భంగా ఈవో వ్రతపురోహితలను అభినందించారు. ప్రతీఏటాదేవస్థానం వ్రతపురోహితులు సంఘం తరుపున స్వామి,అమ్మవార్లకు ఏదో ఒక వస్తువును అందించడం ఆనవాయితీగా చేస్తున్నారు.

సత్యదేవుడి సన్నిధిలో ఐపీఎస్ త్రివిక్రమ వర్మ పూజలు



త్రివిక్రమవర్మకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో


రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో ఐపీఎస్ అధికారి త్రివిక్రమవర్మ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో రామచంద్రమోహన్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందించగా ఈవో వారికి స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

బంగారు ధ్వజస్తంభ ప్రతిష్ఠకు సన్నాహాలు

సత్యదేవుడికి స్వర్ణ ధ్వజస్తంభం ప్రతిష్ఠపై సన్నాహాలు చేస్తున్నారు. నెల్లూరుకు చెందిన ఒకదాత వీటిని తయారు చేయిస్తున్నారు. ఏప్రిల్ 18 నుంచి 22 వరకు ప్రతిష్ఠా కార్యక్రమాలు చేపట్టాలని పండితులు భావిస్తున్నారు. ఈనెల 7న జరిగే పాలకమండలి సమావేశంలో దీనిపై స్పష్టత రానుంది. దీనికి సంబంధించి ఏర్పాట్లపై ఈవో రామచంద్రమోహన్, ఇంజనీరింగ్ అధికారులు, పండితులతో చర్చించారు. ధ్వజస్తంభం లోపలికి ఏవిధంగా తీసుకుని రావాలి అనేదానిపై చర్చించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు రాంబాబు, ఉదయ్‌కుమార్ తదితరులున్నారు.

తిరుపతి ఆలయానికి పోటెత్తిన భక్తులు

- స్వామివారి ఆదాయం రూ.5,15,858



పెద్దాపురం, మార్చి 2: కాకినాడజిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారు జామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.4,11,640 అన్నదానవిరాళాలు రూ.95,518 ఆదాయం, కేశఖండనద్వారా రూ.8,400, తులాభారం రూ.300 వెరసి రూ.5,15,858 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 20వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం చైర్మన్ కర్రి జగదీష్, దేవస్థానం అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు పాల్గొన్నారు.

భక్తుల తాకిడితో అప్పనపల్లి కిటకిట

మామిడికుదురు, మార్చి 2: భక్తుల తాకిడితో అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం కిటకిటలాడింది. వేకువజాము నుంచి భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. కొత్త, పాత గుడులు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం స్వామివారిని 3964మంది దర్శించుకుని 3012మంది అన్నప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,51,139 ఆదాయంగా వచ్చిందని ఏసీ జి.మాధవి తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా దర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

సిద్ధి వినాయకుడికి బంగారు పళ్లెం బహూకరణ



చైర్మన్‌కు బంగారు పళ్లెం అందజేస్తున్న దాతలు

అయినవిల్లి, మార్చి 2: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి వారికి ఓ భక్తుడు బంగారు పళ్లెం, వెండి బిందెలను సమర్పించారు. వీరవల్లిపాలానికి చెందిన సూతాపల్లి సత్యనారాయణ-బాలదుర్గాకుమారి దంపతులు శనివారం విఘ్నేశ్వరస్వామిని దర్శించి రూ.5.10లక్షల విలువైన 81.600 గ్రాముల బంగారు పళ్లెం, రూ.80వేలు విలువైన 1003 గ్రాముల వెండి బిందెను అందజేశారు. శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.20వేలు విరాళంగా ఇచ్చారు. భక్త దంపతులకు అర్చకులు వేదఆశీర్వచనం చేసి శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా భీమశంకరస్వామి కల్యాణం



పూజలు చేస్తున్న నవీన్ దంపతులు

జగ్గంపేట, మార్చి 2: కాకినాడజిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో జ్యోతుల నెహ్రూ కుటుంబం ఆధ్వర్యంలో జరుగుతున్న కోటి పార్థివ లింగం మహారుద్రాభిషేకం శనివారం 6వ రోజు విఘ్నేశ్వర పూజ, పరిషత్ పంచగవ్య ప్రాసన, గోపూజ, మహా న్యాసము, రుద్రాభిషేకము, బిల్వార్చన, కుంకుమార్చన, నవగ్రహ హోమం, వంటిపూజా కాంర్యక్రమాలు నిర్వహించారు. జ్యోతుల నెహ్రూమణి, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు సునీత దంపతులు పీటలపై కూర్చుని భీమశంకర్‌స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిఠాపురం విశ్వవిద్యాల అధ్యాత్మిక పీఠం పీఠాధిపతి డాక్టర్ అమర్ ఆలీషా హాజరై మహారుద్రాభిషేకంలో పాల్గొన్నారు. వేలాదిగా భక్తులు పాల్గొని అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమర్ ఆలీషా మాట్లాడుతూ భగవంతుడు సంకల్పంతో ఈ కోటి మహా రుద్రాభిషేకం నిర్వహించడం ప్రతిరోజు ఏదో ఒక పీఠం నుంచి ఒక పీఠాధిపతిని తీసుకొచ్చి ఆశీస్సులు అందించడం, భక్తితత్వాలు వినిపించడం ఓ మహోన్నత కార్యక్రమం అన్నారు. గోకవరంనకు చెందిన ఆధ్యాత్మిక భక్తుడు తోట సాయి శివతత్వం. రామతత్వం గురించి భక్తులకు వివరించారు. కార్యక్రమంలో కోర్పు లచ్చయ్య దొర, ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కుంచే రాజా, జీను మణిబాబు, పైడిపాల సూరిబాబు, రేఖ బుల్లిరాజు, పాఠంశెట్టి రవి, కుంచే రామకృష్ణ, సూంరపాలెం బాలు, సీఎం, పాఠంశెట్టి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



కోటి మట్టి శివలింగాలకు అభిషేకం చేస్తున్న ఉమర్ అలీషా

విద్యార్థులను ఢీకొన్న కారు

- ఐదుగురికి గాయాలు
- మద్దూరులంక బ్యారేజ్‌పై ఘటన



మద్దూరులంక బ్యారేజీపై ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న పోలీసులు, కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

కొవ్వూరు, మార్చి 2: కారు ఢీకొని ఐదుగురు విద్యార్థులు గాయపడిన సంఘటన కొవ్వూరు మండలం మద్దూరులంక గ్రామంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సూరిశెట్టి సీతామహాలక్ష్మి, అల్లం మనోజ్‌కుమార్, ఆకుల రామవెంకటదుర్గ, రెంపా విర్షిత్, కె.అఖిల్ సైకిళ్లపై శనివారం ఉదయం మద్దూరులోని హైస్కూల్‌కు బయలుదేరారు. బ్యారేజ్‌పై వెనుక నుంచి వస్తున్న కారు విద్యార్థులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థులు కిందపడి గాయాలపాలయ్యారు. దీంతో వారిని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకటదుర్గ, సీతామహాలక్ష్మిలకు బలమైన గాయాలు కావడంతో రాజమహేంద్రవరం రిఫర్ చేశారు. అల్లం మనోజ్‌కుమార్ తండ్రి చిట్టివీరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు తెలిపారు.

భార్యను కడతేర్చిన కసాయి భర్త

- అక్రమ సంబంధాన్ని ప్రశ్నించడమే ఆమె చేసిన పాపం
- వివాహేతర బంధానికి అడ్డుగా ఉందని.. భార్యను కొట్టి చంపేశాడు
- ఆపై ఆత్మహత్యగా చిత్రీకరణ
- పోలీసు విచారణలో నేరం అంగీకారం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, మృతురాలు తానెం లక్ష్మి(ఫైల్)

నల్లజర్ల, మార్చి 2: తమ వివాహేతర బంధానికి అడ్డుగా ఉందని తన భార్యను అత్యంత క్రూరంగా కొట్టి చంపేశాడు. వివరాలిలా ఉన్నాయి. నల్లజర్ల మండలం జగన్నాథపురానికి చెందిన తానెం విష్ణు ఆయిల్‌పామ్ గెలల కోత కార్మికుడిగా చేస్తున్నాడు. 2012లో అదే గ్రామానికి చెందిన లక్ష్మి(28)ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు. లక్ష్మి గత ఆదివారం జంగారెడ్డిగూడెంలో ఉంటున్న తన సోదరి పెద్దింట్లు ఇంటికి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చే సమయానికి విష్ణు తన ఇంట్లో వేరే మహిళతో ఉండడం చూసి గొడవ పడి ంది. అప్పటి నుంచి ప్రతిరోజూ ఏదొక సమయంలో గొడవలు పడుతున్నారు. తమ వివాహేతరబంధానికి భార్యఅడ్డుగా ఉంటుందని భావించిన విష్ణు శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో భార్య నోట్లో గుడ్డలు కుక్కి అత్యంత దారుణంగా చిత్రహింసలకు గురిచేసి చంపేశాడు. మృతదేహాన్ని ఫ్యాన్‌కి వేలాడదీసి ఆత్మహత్య చేసుకున్నట్టు చిత్రీకరించాడు. అదే గ్రామంలో చదువుతున్న కుమార్తె మహి, కుమారుడు రాంచరణ్‌ను పిలిచి. అమ్మమ్మ ఇంటికి వెళ్లి అమ్మ ఆత్యహత్య చేసుకుని చనిపోయిందని చెప్పమని కబురు పంపించాడు. వారంతా వచ్చి చూడగా లక్ష్మి ఫ్యానుకు ఉరితో వేలాడుతూ విగతజీవిగా కనిపించింది. భర్తపై అనుమానంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ టీవీ సురేష్ మృతదేహాన్ని పరిశీలించగా శరీరమంతా గాయాలు ఉండడం గమనించి హత్య కేసుగా నమోదు చేశారు. నిందితుడు విష్ణును పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా తానే హత్యచేసినట్టు అంగీకరించాడు.

శివకోటిలో భారీ దొంగతనం

- రూ.20లక్షలు విలువచేసే బంగారం, వెండి, నగదు అపహరణ



శివకోటిలో తలుపులు బద్దలకొట్టిన దొంగలు

రాజోలు, మార్చి 2: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకోటిలో గాదె వెంకటసూర్యరామ మురళీకృష్ణ ఇంట్లో దొంగలు చొరబడి తాళాలు పగులకొట్టి, ఇంట్లో ఉన్న రూ.20లక్షల విలువచేసే బంగారం, వెండి, నగదును దోచుకువెళ్లారని శనివారం రాజోలు ఎస్ఐ జి.పృథ్వి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మురళీకృష్ణ కుటుంబ సభ్యులు గత నెల 28న కుటుంబ సభ్యులతో వివాహ వేడుకకు మచిలీపట్నం వెళ్లారు. శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చేసరికి తలుపులు బద్దలకొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా బీరువాలో ఉన్న బంగారం, వెండి, నగదును దొంగలు దోచుకువెళ్లారు. దీంతో దొంగతనం జరిగిందని భావించిన మురళీకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలానికి రాజోలు ఎస్ఐ పృథ్వి తన సిబ్బందితో వచ్చి పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీములు చేరుకుని ఆధారాలు సేకరించారు. మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పృథ్వి తెలిపారు.

పడవ ప్రమాదంలో మత్స్యకారుడు మృతి



కొపనాతి కోదండ

ఉప్పలగుప్తం, మార్చి 2: వాసాలతిప్ప ప్రాంతంలో చేపల వేటకు వెళ్లిన బోటు తిరగబడి అల్లవరం మండలం నక్కా రామేశ్వరంనకు చెందిన కొపనాతి కోదండ(40) మృతి చెందాడు. నక్కారామేశ్వరంనకు చెందిన ఆరుగురు మత్స్యకారులు శనివారం ఉదయం పంతాడి పెంటయ్యకు చెందిన ఇంజన్ బోటులో సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. చల్లపల్లి పంచాయతీ వాసాలతిప్ప తీరంలో సముద్రంలో వేటాడుతుండగా బోటు తిరగబడింది. ఈ ప్రమాదంలో కొపనాతి కోదండ సముద్రంలో మునిగి ఊపిరాడక మృతి చెందాడు. పడవలోని మిగిలిన అయిదుగురు సురక్షితంగా బయటపడ్డారు. మృతుని సోదరుడు శివయ్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె.మనోహర్‌జోషీ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

గోపాలపురం, మార్చి 2: గోపాలపురం శివారు పొగాకుబోర్డు సమీపంలో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ కే.బాలసురేష్ బాబు వివరాల ప్రకారం.. చాగల్లు గ్రామానికి చెందిన ఆంజనేయులు దేవరపల్లి నుంచి ద్విచక్రవాహనంపై గోపాలపురం వైపు వస్తుండగా గోపాలపురం వైపు నుంచి వెళ్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామన్నారు. ఆయన వెంట ఎస్ఐ కె.సతీష్‌కుమార్ ఉన్నారు.



ఎగుమతి చేసేందుకు సిద్ధం చేస్తున్న పచ్చిమామిడికాయలు

కొండెవరం టూ కలకత్తా
పచ్చిమామిడి ఎగుమతి

కొండెవరం (కొత్తపల్లి), మార్చి 2: ఎండాకాలం వచ్చేసింది. పచ్చిమామిడికాయలు ఎగుమతిచేసే సీజన్ ఆరంభమైంది. కాకినాడజిల్లా కొత్తపల్లి మండలం కొండెవరం నుంచి కలెక్టర్ రకం పచ్చిమామిడికాయలను కలకత్తా ఎగుమతి చేసేందుకు రైతుల నుంచి సేకరిస్తున్నారు. కొండెవరంలో మూడు కేంద్రాల నుంచి పచ్చిమామిడి కాయలను సేకరించేందుకు కేంద్రాలను సిద్ధం చేశారు. చేలల్లోనుంచి కోసుకొచ్చిన పచ్చిమామిడికాయలను కిలో రూ.35లకు వర్తకులు టోకుగా కొనుగోలు చేస్తున్నారు. వీటిని కలకత్తా నగరానికి రవాణా చేస్తామని కొనుగోలు దారుడు జి.కోటి చెప్పారు.

స్వల్పకాలిక శిక్షణా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ధవళేశ్వరం, మార్చి 2: పీఎంకేవీవై పథకంలో భాగంగా జిల్లాలోని నిరుద్యోగ యువతకు అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు సంబంధించి స్వల్పకాలిక కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45ఏళ్ల మధ్య వయసుండి పదో తరగతి ఆపై విద్యార్హత ఉన్న అభ్యర్థులు ఆధార్‌కార్డు జిరాక్స్, ఈమెయిల్ ఐడీ, ఫోన్ నెంబర్లతో ఈనెల 15 లోపుగా కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని కోరారు. వివరాలకు 92420 50231లో సంప్రదించాలని కోరారు.

జింకపై వీధి కుక్కల దాడి

- రక్షించిన స్థానికులు
- ఫారెస్టు అధికారులకు అప్పగింత



కుక్కల దాడిలో గాయపడ్డ జింక

మోతుగూడెం, మార్చి 2: చింతూరు మండలం మోతుగూడెంలో శనివారం పోస్టు ఆఫీస్ సెంటర్‌లో ఉదయం అడవిలో నుంచి జింక ఊరులోకి వచ్చింది. దానిపై ఒక్కసారిగా వీధి కుక్కలు దాడి చేశాయి. దాన్ని గమనించిన స్థానికంగా నివాసం ఉంటున్న ఏపీ జెన్కో ఉద్యోగులు వీధి కుక్కల నుంచి జింకను రక్షించారు. అనంతరం ఫారెస్ట్ సిబ్బందికి ఫోన్ చేసి జింకను అప్పగించారు. పశువైద్యాధికారి వద్ద ప్రథమ చికిత్స చేయించి పెద్ద పొలాల అడవిలో వదిలిపెట్టారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండండి

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



నిందితులను పట్టుకుని వివరాలు తెలుపుతున్న డీఎస్పీ రామారావు

గోపాలపురం, మార్చి 2: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు డీఎస్పీ కేసీహెచ్ రామారావు తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన సీకే గౌతమ్‌రాజ్, కేవీస్ వినయ్‌కుమార్ పువ్వుల వ్యాపారంలో నష్టం రావడంతో అధిక ధనార్జన కోసం గంజాయి వ్యాపారానికి తెరదీశారు. ముందస్తు సమాచారంతో శుక్రవారం సాయంత్రం గోపాలపురం మండలం జగన్నాధపురం శివారులో ఏర్పాటుచేసిన బోర్డరు చెక్‌పోస్టు వద్ద దేవరపల్లి సీఐ బాలసురేష్‌బాబు, ఎస్ఐ సతీష్‌కుమార్, రెవెన్యూ సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గంజాయి తరలిస్తున్న ఇద్దరినీ అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి 4.290కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

తెలంగాణ రాష్ట్రం ములుగుజిల్లా మంగపేట గ్రామం దేవత హనుమంత రావు అపరాల వ్యాపారం చేస్తుంటాడు. అతడి వద్ద తెలంగాణకు చెందిన బైట్ల సాయిబాబా 20 ఏళ్లుగా గుమస్తాగా పని చేస్తున్నాడు. వ్యాపారంలో భాగంగా సాయిబాబా తరచూ అపరాలు కాకినాడ తీసుకెళ్లి అమ్ముతుంటాడు. అక్కడ అపరాలు అమ్మిన సొమ్ము రూ.7,45,000 బ్యాగులో పెట్టుకుని గత నెల 29వ తేదీన బస్సు ఎక్కి రాజమండ్రిలో దిగాడు. అక్కడ సాయిబాబాకు గతంలో పరిచయం ఉన్న అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట గ్రామానికి చెందిన ఏర్నేటి విజయకుమారి, ఆమె మేనల్లుడు మాడా మణికుమార్ తారసపడ్డారు. తాము కూడా తెలంగాణ వస్తున్నామని చెప్పి సాయిబాబాతో పాటు రాజమండ్రిలో బస్సు ఎక్కారు. గోపాలపురం చెక్‌పోస్టు సెంటర్‌కి వచ్చేసరికి సాయిబాబా నిద్రపోతున్న సమయంలో ఇద్దరూ సొమ్ము ఉన్న బ్యాగును దొంగిలించి బస్సు దిగి పారిపోయారు. మెలకువ వచ్చి చూడగా సాయిబాబా దగ్గర సొమ్ములున్న బ్యాగ్ కనిపించకపోవడంతో గోపాలపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దేవరపల్లి సీఐ బాలసురేష్‌బాబు, ఎస్ఐ కె.సతీష్ కుమార్ మండపేట వెళ్లి విజయకుమారి, మణికుమార్‌లను చాకచక్యంగా అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.7,45,000 రికవరీ చేశారని, వారి వెంట హెడ్‌కానిస్టేబుల్ సత్యానందం, పోలీస్ సిబ్బంది ఉన్నారని డీఎస్పీ రామారావు తెలిపారు.

సత్యదేవా నర్సరీని సందర్శించిన ఆర్‌బీఐ బృందం

కడియం, మార్చి 2: కడియపులంకలో సత్యదేవానర్సరీని శనివారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రీజనల్ డైరెక్టర్ ఏవో బషీర్, జీఎం అనుజ్ రాజన్, జీఎం మేఘనసింగ్, డీజీఎం అనతి తదితరులు సందర్శించారు. నర్సరీ అధినేత పుల్లా అబ్బులు ఆర్‌బీఐ అధికారికి థాయ్ ఆగ్లోనిమా అనే మొక్కను అందజేసి స్వాగతించారు. అధికారులు నర్సరీలో వివిధ రకాల మొక్కలు పరిశీలించారు. వాటి వివరాలు, శాస్త్రీయ నామాలను పుల్లా వీరబాబు, రాజశేఖర్‌లు వివరించారు. నర్సరీరంగ అభివృద్ధికి బ్యాంకుల మద్దతు ఎప్పుడూ ఉంటుందని, త్వరలో బ్యాంకు కార్యాలయాలు రానున్నాయని వాటి సుందరీకరణకు మొక్కల అవసరం నిమిత్తం వారు నర్సరీని సందర్శించామన్నారు. వారి వెంట రాజమహేంద్రవరం యూనియన్ బ్యాంక్ అధికారులు ప్రసాద్, క్రిష్టయ్య తదితరులున్నారు.



ఆర్‌బీఐ అధికారికి మొక్కను అందజేస్తున్న పుల్లా అబ్బులు

● మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు
● టీడీపీ, జనసేన మహిళాశక్తి సమావేశం
● అరాచక పాలన తరిమికొడతామని నినాదాలు

నాడులను ఉత్తేజపరిచే సూర్యారాధన

ఉప్పలగుప్తం, మార్చి2:సూర్యనారాయణుని ఆరాధన మానవనాడీ మండలాన్ని ఉత్తేజ పరిచి ఆరోగ్యకర జీవితాన్ని ప్రసాదిస్తుందని వేదపండిత పరిక్షకుడు గరిమెళ్ల విశ్వనాథం తెలిపారు. విలసవిల్లి శ్రీరామ మందిరంలో నిర్వహిస్తున్న నక్షత్ర నవగ్రహ పూర్వక మహాసౌరయాగం 22వ రోజు శనివారం పూజల్లో వేదస్వస్తి నిర్వహించారు. వేదపండితులు కర్రా బాస్కరరావు దాని, మంగిపూడి శ్రీకృష్ణచైతన్య, గంటి శివ, మాగం సుబ్బయ్య, ఆకెళ్ల నారాయణమూర్తి, గోడి సుబ్రహ్మణ్యం వేదస్వస్తిలో పాల్గొని పూజలు చేశారు.

చెక్కు చెదరని టీడీపీ కార్యకర్తల ఆత్మవిశ్వాసం


సమావేశంలో మాట్లాడుతున్న హరీష్‌మాధుర్

మలికిపురం, మార్చి 2: రాజోలు నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తల ఆత్మవిశ్వాసం చెక్కు చెదరలేదని గంటి హరీశ్ మాధుర్ అన్నారు. శనివారం లక్కవరంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ముదునూరి వినాయకరాజు ఇంటి వద్ద జరిగిన మలికిపురం టీడీపీ మండల కార్యకర్తల సమావేశంలో హరీష్‌మాధుర్ మాట్లాడారు. గొల్లపల్లి సూర్యారావు మోసపూరిత మాటలు నమ్మే పరిస్థితిలో ఏ కార్యకర్త లేరన్నారు. సూర్యారావుకు టీడీపీ ఏమి అన్యాయం చేసిందో చెప్పాలన్నారు. పార్టీ కార్యక్రమాలు రాజోలులో గొప్పగా జరిగాయంటే అది కార్యకర్తల కృషి మాత్రమేనన్నారు. రాజోలు ఇన్‌చార్జి వ్యవహారం అధిష్ఠానం చేతిలో ఉందన్నారు. త్వరలో రాజోలు నియోజకవర్గంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు అడబాల యుగంధర్, మంగిన భూదేవి, సర్పంచ్ కేశ పుష్పకుమారి, బందెల వద్ది, మోకా పార్వతి, ముత్యాల దుర్గాదేవి, పెట్లబోయిన హేలిన, అడబాల రమాదేవి, ఎంపీపీ కేతా శ్రీనివాస్, అడబాల సాయిబాబు, చెల్లింగి సత్యనారాయణ, గెద్దం సింహ, విప్పర్తి నాని, గుబ్బల శ్రీనివాస్, మెల్లేటి శ్రీనివాస్, దాగంటి స్వామి, రుద్రరాజు బంగార్రాజు, బోనం సాయిరామ్, తాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయండి


శివరాత్రి ఉత్సవాలపై సమీక్ష చేస్తున్న ఆర్డీవో సుధాసాగర్

కె.గంగవరం, మార్చి 2: కోటిపల్లిలో ఈనెల 7,8, 9తేదీల్లో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని రామచంద్రపురం ఆర్డీవో, ఉత్సవ కమిటీ చైర్మన్ సుధాసాగర్ అన్నారు. శనివారం కోటిపల్లి శ్రీఛాయాసోమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఉత్సవ నిర్వహణకు సంబంధించిన అధికారులతో ఆయన సమీక్ష చేశారు. ఉత్సవాలు జరుగు రోజుల్లో నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. నాలుగు మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, 108వాహనాలు సిద్ధంగా ఉంచాలని ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఉత్సవం రోజున ఫైర్ వాహనాన్ని సిద్ధంగా ఉంచాలని ఫైర్ అధికారులను, నీరు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటుచేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారిని, కూల్లెస్తు, భక్తులకు తాగునీరు, ఉచిత ప్రసాద పంపిణీ, భక్తుల సౌకర్యాల వంటివి దేవస్థానం అధికారులు చూసుకోవాలని, స్నానఘట్టాల వద్ద బారికేడ్లు, గజఈతగాళ్లు ఏర్పాట్లు చేయాలని, ఉత్సవాల్లో దుకాణాలు ఏర్పాటుతో పాటు పలు అంశాలు పంచాయతీ అధికారులు నిర్వహించాలని ఆదేశించారు. 500మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్టు రామచంద్రపురం డీఎస్పీ డి.రామకృష్ణ చెప్పారు. సమావేశంలో సీఐ పి.దొరరాజు, ఎస్ఐ జానీ బాషా, దేవదాయ శాఖ ఏసీ డి.నాగమల్లేశ్వరరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి బాలజీరామ్‌ప్రసాద్, ఈవో శ్రీదేవి, తహసీల్దార్ రవీంద్రబాబు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో యు.నాగేంద్ర, ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, దేవస్థానం చైర్మన్ పిల్లి శ్రీనివాసు, సర్పంచ్ పెమ్మాడి జేవీ సత్తిబాబు, మాజీ సర్పంచ్‌లు అయినవిల్లి వీరవెంకట సత్యనారాయణ(అబ్బు), కర్రి చిట్టిబాబు పాల్గొన్నారు.

గజ వాహనంపై వేంకటేశ్వరస్వామి ఊరేగింపు

ఆలమూరు, మార్చి 2: చింతలూరు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గజవాహనంపై శనివారం స్వామివారి ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. పాంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు శ్రీదేవిభూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం వసంతోత్సవం, గుడోత్సవం, వెంకటేశ్వరస్వామి ప్రశంజరిగాయి.పలువురు ప్రముఖుల ఆధ్యాత్మిక ప్రవచనం అనంతరం స్వామివారిని గజవాహనంపై ఉంచి చింతలూరు వీధుల్లో ఊరేగించారు. శనివారం భక్తులు భారీగా తరలివచ్చారు ఈసందర్భంగా ఆలయ బ్రహ్మోత్సవ కమిటీ అధ్యర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి దంపతులు బ్రహ్మోత్సవాలను తిలకించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు జగ్గిరెడ్డి దంపతులు రూ.లక్ష విరాళాన్ని బ్రహ్మోత్సవ నిర్వాహకులు అల్లూరి రాజు భరణికి అందజేశారు.

కారు, ఆటో ఢీ: ఐదుగురికి గాయాలు

రాయవరం, మార్చి 2: కారు, ఆటో ఎదురుగా ఢీకొట్టిన ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. రాయవరం నుంచి ద్రాక్షారామ వైపు మాచవరం వైపుకు వెళ్తున్న ఆటోను మాచవరం వైపు నుంచి సోమేశ్వరం వస్తున్న కారు మాచవరం వద్ద ఢీకొట్టింది. ఆటో అదుపుతప్పి రోడ్డుపై మోటారుసైకిల్‌పై వస్తున్న వ్యక్తిని, నడిచి వెళ్తున్న మహిళను ఢీకొట్టింది. ఐదుగురు గాయపడ్డారు. సబ్బెళ్ల కాంచన ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు.

సైన్స్ ప్రదర్శనలో జి.అగ్రహారానికి తృతీయస్థానం

అంబాజీపేట, మార్చి 2: కొత్తపేటలో జరిగిన జిల్లాస్థాయి సైన్స్ ప్రదర్శనలో జి.అగ్రహారం హైస్కూల్ విద్యార్థులు చొల్లంగి హేమ విజయలక్ష్మి, డొంగ బాలఅప్పలస్వామి గైడ్ టీచర్ ఎంఎస్ఎస్ కుమారి ఆధ్వర్యంలో రీసైక్లింగ్ ఆఫ్ వేస్ట్ బిండర్ కోకోపిట్ అనే ప్రాజెక్టును తయారుచేసి ఉన్నత ప్రతిభ కనబరిచారు. ఈప్రాజెక్టుకు తృతీయ స్థానం వచ్చినట్టు హెచ్ఎం కె.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక పాఠశాలలో గైడ్‌టీచర్, విద్యార్థులను అభినందించారు. సర్పంచ్ డొంగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని, ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాశ్, ఉపసర్పంచ్ బండారు రాంబాబు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మట్టపర్తి సూర్యనారాయణ అభినందించారు.

మహిళా శక్తి నుంచే మార్పు మొదలు కావాలి


ఆలమూరు: టీడీపీ, జనసేన మహిళా శక్తిలో పాల్గొన్న బండారు

ఆలమూరు, మార్చి 2: రాష్ట్రంలో సాగుతున్న అరాచక పాలనకు ముగింపు మహిళల నుంచే మొదలు కావాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. ఆలమూరు మండలం టీడీపీ, జనసేన మహిళాశక్తి సమావేశం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా బండారు సత్యానందరావు మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన పార్టీల కలయికతో మహిళల్లో ఉత్సాహం పెరిగిందని, ఈఉత్సాహంతో వచ్చే ఎన్నికలలో పార్టీ విజయానికి పూర్తిస్థాయిలో కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఆరాచకాలను తరిమికొట్టడానికి తామంతా ఉద్యమించడానికి సిద్ధంగా ఉన్నామని మహిళలు నినాదాలు చేశారు. మహిళా నాయకురాలు సత్తిరాజు ఉషారాణి, దుగ్గిరాల సుబ్బలక్ష్మి, దుడంగి మమత, విద్యాప్రసన్న, అనసూరి నాగరత్నం, కోట వరలక్ష్మి, మెర్ల సత్యవతి, గంగుల నాగజ్యోతి, కాలా రాణివేణి, అల్లూరి ప్రసన్నకుమారి, వంటపాటి దుర్గాదేవి, వక్కపట్ల సువర్చల, జల్లూరి లక్ష్మి, రెడ్డి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సునీత ప్రశ్నలకు జగన్ సమాధానం చెప్పగలరా

కొత్తపేట, మార్చి 2: వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె వైఎస్ సునీత అడిగే ప్రశ్నలకు జగన్ సమాధానం చెప్పగలరా అంటూ కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు ప్రశ్నించారు. వాడపాలెం పార్టీ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొంత బాబాయిని ఎవ్వరూ పొట్టనబెట్టుకున్నారు. సీబీఐతో దోబూచులాడిన ఎవరో ప్రజలకు పూర్తిగా అర్థమైందన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య నారాసుర చరిత్రని గొగ్గోలుపెట్టిన జగన్ గొడ్డలి వేటు చరిత్ర ఎవ్వరిదో వివేకా కుమార్తె సునీత స్వయంగా చేసిందన్నారు. మొదట సునీత అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పి, తర్వాతే జగన్ బాబాయ్ హత్యపై మాట్లాడాలన్నారు. సునీత అడిగే ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పే ధైర్యం వైసీపీ నాయకులకు ఉందా అని ప్రశ్నించారు. సొంత తల్లిని, చెల్లిని గెంటివేసి జగన్ బాబాయ్ కుమార్తె సునీతకు న్యాయం చేస్తారనే నమ్మకం ప్రజలకు లేదన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని తగిన సమయంలో బుద్ధిచెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు కంఠంశెట్టి శ్రీనివాసరావు, ముత్యాల బాబ్జీ, బూసి బాస్కరరావు, పల్లి ఏసు, రెడ్డి తాతాజీ, చవల జగన్నాథం, యెలిశెట్టి చిన్న, సుదాబత్తుల బహదూర్, గనిశెట్టి వీరేష్, పప్పుల బుజ్జి, కడియం చిన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళలను ముందుకు తీసుకువెళ్లడమే లక్ష్యం

రావులపాలెం, మార్చి 2: మహిళలకు పూర్తిస్థాయిలో ఆర్థిక స్వేచ్ఛ కల్పించి అన్నిరంగాల్లో ముందుకు తీసుకువెళ్లడమే టీడీపీ లక్ష్యమని టీడీపీ, జనసేన ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం క్యాంపు కార్యాలయంలో మండల తెలుగు మహిళల ఆధ్వర్యంలో మహిళా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న సత్యానందరావు మాట్లాడుతూ టీడీపీ, జనసేన గెలుపు లక్ష్యంగా కృషి చేయాలన్నారు. మహిళల అభ్యున్నతి కోసం రాబోయే రోజుల్లో ఉమ్మడి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. మహిళలను అన్ని రంగాల్లోనూ ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సత్తిరాజు ఉషారాణి, దుగ్గిరాల సుబ్బలక్ష్మి, దేవిపూడి దుర్గ, కుక్కల రాణి, పమ్మి శాంతకుమారి, సకినాల నాగజ్యోతి పాల్గొన్నారు.

జగన్ శవ రాజకీయాలు మానుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కేతా శ్రీను

రాజోలు, మార్చి 2: సీఎం జగన్మోహన్‌రెడ్డి శవ రాజకీయాలు మానుకోవాలని ఎంపీపీ కేతా శ్రీను తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా రాజోలులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి సీఎం ఆయ్యాక జగన్ తన బాబాయ్ వివేకానందరెడ్డి కేసును తప్పుడోవ పట్టిస్తున్నారని విమర్శించారు. జగన్ మాట తప్పారు. మడమ తిప్పారని, శవ రాజకీయాలు అలవాటుపడిపోయిన వ్యక్తి అని, ఇటువంటి వ్యక్తి మళ్లీ అధికారంలోకి వస్తే సామాన్యులకు జతకడం కష్టంగా మారుతుందన్నారు. రాజోలు, మలికిపురం, మామిడికుదురు, సఖినేటిపల్లి మండలాల పార్టీ అధ్యక్షులు గుబ్బల శ్రీనివాస్, అడబాల యుగంధర్, మెల్లేటి శ్రీనివాస్, ముప్పర్తి నానిలతో పాటు ప్రధాన కార్యదర్శి దాగంటి స్వామి, తాడి సత్యనారాయణ, బల్లిపి బాబ్జీ పాల్గొన్నారు.

ఆలయంలో కలెక్టర్ పూజలు

అంతర్వేది, మార్చి 2: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కలెక్టర్ హిమాన్షు శుక్లా దంపతులు శనివారం విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు మంగళ స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు ఆశీర్వచనం అందించారు. ఉత్సవాల నిర్వహణలో అర్చకులు, అధికారులు, సిబ్బంది మంచి సేవలందించారని కలెక్టర్ అభినందించారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం: వేగుళ్ల


మండపేటలో పర్యటించిన ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, మార్చి2. రాష్ట్రంలో రాక్షస పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేటలో శనివారం బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా స్థానిక విజయలక్ష్మీనగర్, బ్యాంకుకాలనీ, కళ్యాణనగర్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అపార్ట్‌మెంట్ వాసులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. నాలుగున్నరేళ్లలో వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. టీడీపీ, జనసేన పార్టీల గెలి పించాలని ఆయన కోరారు. మాజీ మున్సిపల్ చైర్మన్ చుం డ్రు శ్రీవరప్రకాష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాడా ప్రసాదరావు, కౌన్సిలర్ యరమాటి గంగరాజు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

5న జాబితా ప్రకటన

అల్లవరం, మార్చి 2: ఈపంట సామాజిక తనిఖీకి సంబంధించి ఈనెల5న జాబితా ప్రకటిస్తారని, తప్పులుంటే సవరించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు సూచించారు. కోడూరుపాడు సచివాలయం వద్ద ఈపంట సామాజిక తనిఖీ గ్రామసభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండలంలో 4305 ఎకరాల్లో ఈ-పంట నమోదు పూర్తయిందని, 2400మంది రైతులు పంట సాగు చేశారన్నారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, మండల వ్యవసాయాధికారి ఎన్ఎస్‌వీ సత్యనారాయణ, కొనుకు బాపూజీ, వీఆర్వో నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి చిక్కం శ్రీనివాస్, ఆకుల శ్రీనివాస్, నక్కా రామారావు, కొక్కిరిపాటి మహాలక్ష్మి, జి.శివమోహన్, బియ్యగ్రాశాణి పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

ద్రాక్షారామ, మార్చి 2: ఓటు హక్కుపై శనివారం రెవెన్యూ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి తాళ్ళపొలం, జన్మాష్టమిపురం మీదుగా ద్రాక్షారామ బోసుబొమ్మ సెంటర్ వరకు ప్లైర్ ర్యాలీ జరిపారు. ర్యాలీని ఆర్డీవో సుధాసాగర్ ప్రారంభించారు. తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ

ద్రాక్షారామ, మార్చి 2: అంబికపల్లి అగ్రహారం కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో పల్స్‌పోలియో కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కమ్యూనిటీ ఆరోగ్యకేంద్రం అధికారి స్వప్న, హెల్త్ అసిస్టెంట్ జ్యోతి, వీఆర్ఓ, సచివాలయ సిబ్బంది, కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం వీఆర్ఓ పాల్గొన్నారు.

రామచంద్రపురం: పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు తొగరు మూర్తి అన్నారు. మోడరన్ విద్యానికేతన్ ఆధ్వర్యంలో జి.వీరావు ఆధ్వర్యంలో విద్యార్థులు పోలియో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సుదాకర్ సాయి, మాణిక్యం పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

కపిలేశ్వరపురం, మార్చి 2: మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ అఖిల భారత రైతుకూలీ సంఘం, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం అంగర రింగ్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా భారత కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి జిల్లా కార్యదర్శి చిక్కల వెంకటేశ్వరరావు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు వి.భీమశంకర్ మాట్లాడారు. రెండేపదా అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన 3 వ్యవసాయ చట్టాలను రద్దుచేయాలని, విద్యుత్ చట్టసవరణ బిల్లు వెనక్కు తీసుకోవాలని, పంటలకు మద్దతు ధర చట్టం అమలు చేయాలంటూ 13 నెలల పాటు లక్షలాది మంది రైతులు ఢిల్లీని ముట్టడించారన్నారు. ఈఉద్యమంలో 700 మందికిపైగా రైతులు అమరులయ్యారన్నారు. రైతులతో చర్చించి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేకుంటే వచ్చే ఎన్నికల్లో మోదీ, జగన్ ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదని వారు హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు, ప్రజావ్యతిరేక విధానాలు నశించాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు వీర్రాజు, నాగేశ్వరరావు, అప్పారావు, శ్రీను, రైస్‌మిల్లు కార్మికులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలి

ముమ్మిడివరం, మార్చి 2: ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవడం ద్వారా శాంతియుత సమాజాన్ని నెలకొల్పడం సాధ్యమవుతుందని అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెంలో శ్రీ హరిసాతేశ వేంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో రూ.6కోట్లతో నూతనంగా నిర్మించిన మల్టీపర్పస్ కన్వెన్షన్ హాలును శనివారం వారు ప్రారంభించారు. ఆలయ, కల్యాణ మండప నిర్మాణ దాతలైన పెన్మెత్స చిట్టిరాజును ఎంపీ, ఎమ్మెల్యేలు అభినందించారు. కార్యక్రమంలో పెన్మెత్స చిట్టిరాజు, ఎంపీపీ కోలా గంగాభవాని, జడ్పీటీసీ కుడుపూడి శంకరరావు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, పెయ్యల చిట్టిబాబు, పెన్మెత్స జగన్నాథరాజు, కాశ బాలమునికుమారి, పెయ్యల బాలకృష్ణ, కోలా బాబ్జీ, రెడ్డి హేమసుందర, బొంతు సత్యశ్రీనివాస్, జగతా బాబ్జీ, తిరుకోటి శాంతిసుధ, వేటుకూరి బోసురాజు, సరెపెల్ల రామకృష్ణంరాజు, చెల్లి బాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

జిల్లాలో 96.4శాతం ఈకేవైసీ పూర్తి

ముమ్మిడివరం, మార్చి 2: జిల్లాలో 2023-24 రబీ సీజన్‌కు సంబంధించి 96.4శాతం ఈకేవైసీ పూర్తి చేసినట్టు జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు తెలిపారు. 1,73,397ఎకరాల్లో ఈక్రాప్ నమోదుచేసి రైతుల ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. సామాజిక తనిఖీల్లో భాగంగా గ్రామాల్లోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఇ-క్రాప్ ముసాయిదా జాబితాను ప్రదర్శించామని, దీనిపై గ్రామ సభలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఈజాబితా ఈనెల5 వరకు రైతుల పరిశీలనార్థం అందుబాటులో ఉంచుతామన్నారు. జాబితాలో తప్పులుంటే ఆ భ్యంతరాలను రాత పూర్వకంగా వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలకు తెలియజేయాలన్నారు. ఆర్బీకే అధికారి అభ్యంతరాలు పరిశీలించి వాటిని మండల వ్యవసాయాధికారి, తహసీల్దార్ ఆమోదానికి లోబడి ఈ నెల5లోపు తుది జాబితాలో చేరుస్తామన్నారు. ఈ-క్రాప్ రబీ సీజన్‌కు సంబంధించి నవరణలకు ఇది చివరి అవకాశమన్నారు.

పవన్ నిర్ణయం మేరకే పనిచేస్తాం: జనసేన

మండపేట, మార్చి2. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకే తాము కలిసికట్టుగా పనిచేస్తామని, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ సారధ్యంలో పనిచేస్తామని జనసేన నియోజకవర్గ అధికార ప్రతినిధి శెట్టి రవి చెప్పారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి అభ్యర్థి ప్రకటన తర్వాత రెండు పార్టీల వారు సమన్వయంతో పనిచేయాలని పవన్‌కళ్యాణ్‌ను లీలాకృష్ణ కలిశారని శెట్టి తెలిపారు. పవన్ ఆదేశాలను గౌరవిస్తామన్నారు. జనసేన వేరు, లీలాకృష్ణ వేరులా చూస్తే మాత్రం సహించేదిలేదన్నారు. త్వరలో లీలాకృష్ణ జనసేన నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి విషయాలను వెల్లడిస్తారన్నారు. జనసైనికులు అధైర్యపడవద్దని రవి కోరారు.

జిప్‌మెర్‌లో రోగులకు మల్లాడి పరామర్శ

యానాం, మార్చి 2: పుదుచ్చేరి జిప్‌మెర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యానానికి చెందిన పలువుర్ని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పరామర్శించారు. వారికి అందుతున్న వైద్యసేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను కోరారు.

టీడీపీని విమర్శించే హక్కు స్టాలిన్‌బాబుకు లేదు

అంబాజీపేట, మార్చి 2: గత ఎన్నికల్లో టీడీపీ అందించిన పార్టీ సొమ్మును పక్కదారి పట్టించి ఇప్పుడు అదే పార్టీ అధినేత చంద్రబాబునాయుడిపై అంబాజీపేటకు చెందిన వైసీపీ నాయకుడు నేలపూడి స్టాలిన్‌బాబు విమర్శలు చేస్తే సహించబోమని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి వీరవెంకట సత్యనారాయణ హెచ్చరించారు. పుల్లేటికుర్రులో దాసరి ఇంటి వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధినేతపై విమర్శలు చేస్తే గుణపాఠం చెబుతామని స్టాలిన్‌బాబును దాసరి హెచ్చరించారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

ముమ్మిడివరం, మార్చి 1: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. అయినాపురంలో శనివారం పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. గ్రామ సర్పంచ్ మోకా రామారావు అధ్యక్షత జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. పెన్మెత్స చిట్టిరాజు, పెయ్యల బాలకృష్ణ, పెయ్యల చిట్టిబాబు, జడ్పీటీసీ కుడుపూడి శంకరరావు, ఎంపీపీ కోలా గంగాభవాని, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్, కోలా బాబ్జీ, ఉడ్డి హేమసుందర్, సర్పంచ్ మోకా రామారావు, వెంకటలక్ష్మి, మట్టపర్తి సురేష్, పామ నాగమణి, యండుకూరి సుబ్బారావు, వనమడి రామకృష్ణ, ఎనుకుటి శివకుమార్ పాల్గొన్నారు.

సాయి విద్యా నికేతన్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

ఐ.పోలవరం, మార్చి2:గుత్తెనదీవిసాయి విద్యానికేతన్ సిల్వర్ జూబ్లీ వేడుకలు శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగామాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ పాల్గొన్నారు. స్కూల్ కరస్పాండెంట్ నల్లాది శ్రీనును సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎంపీపీ ఎం.రాజేశ్వరలక్ష్మి, జడ్పీటీసీ మసునూరి సతీష్‌రాజు, సర్పంచ్ దుర్గాదేవీమణి సుబ్బయ్యా, సొసైటీ ప్రెసిడెంట్ కె.నరసింహమూర్తి, మెండా వెంకటేశ్వరరావు(జాన్‌బాబు), మాజీసర్పంచ్ అంగాని వెంకటసీతారామ్, జి.మూలపోలం,ఎదుర్లంక సర్పంచ్ మెండు పాపాని విజయలక్ష్మీవరప్రసాద్, ముదునూరి పద్మావతీప్రసాద్ నరావు, ఎంపీటీసీ నల్లాది జ్యోతి, దోనిశెట్టి జ్యోతి, లంకలపల్లి దుర్గారాణి జమ్మి, కాటం సత్తిరావు, పిల్లి సలాని రేణుక, సీతారామయ్య పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

రాయవరం, మార్చి2: రాయవరం శివారు పేకాట ఆడుతున్న ఐదుగుర్ని అరెస్టుచేసి, రూ.3,400 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ జి.సురేష్ తెలిపారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: చార్లీ 111
వెంకటరమణ	: ఆపరేషన్ వాలంటైన్
శ్రీలలిత	: భూతద్దం భాస్కర నారాయణ
శేఖర్ ఫ్లిక్స్-1	: ఊరుపేరు భైరవకోన
శేఖర్ ఫ్లిక్స్-2	: హనుమాన్
రమా	: గుంటూరు కారం
గణపతి	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండు
వెంకటపద్మావతి ఫ్లిక్స్-1	: ఆపరేషన్ వాలంటైన్
వెంకటపద్మావతి ఫ్లిక్స్-2	: డూన్

అంబేడ్కర్ భవనం అన్ని వర్గాలకూ ప్రయోజనకరం

ఉప్పలగుప్తం, మార్చి 2: ఉప్పలగుప్తంలో ప్రధాన రహదారికి ఆనుకుని నిర్మించిన అంబేడ్కర్ సామాజిక భవనం మండలంలో అన్ని వర్గాల సామాన్య ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. అన్ని కార్యక్రమాలు నిర్వహించుకునేలా రూ.85లక్షలతో నిర్మించిన అంబేడ్కర్ భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. సర్పంచ్ డిమ్మి చిన్నవరాజు అధ్యక్షతన భవన కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. మధుర దొరబాబు సహకారంతో మంత్రి, ఎమ్మెల్సీలతో పాటు భవన నిర్మాణంలో విశేష సేవలందించిన పీఆర్ డీఈఈ రాంకుమార్‌ను కమిటీ సన్మానించింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయేలు, ఎంపీపీ దంగేటి వీరలక్ష్మణకుమారీశంకర్‌బాబు, జడ్పీటీసీ గెడ్డం సంపదరావు, వైఎస్ఎంపీపీ సాధే శ్రీనివాసరావు, వైసీపీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జీ, జనసేన నాయకుడు ఉనికపట్ల రమణబాబు,ఉద్యానవన విశ్వవిద్యాలయ బోర్డు డైరెక్టర్ జిన్నూరి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకుడు గెడ్డం సురేష్‌బాబు, టీడీపీ నాయకులు పెయ్యల దుర్గారావు, నండిక శ్రీనివాస్, సిర్రీ సత్తిబాబు, వైసీపీ మండల కన్వీనర్లు జిన్నూరి గంగాబాలాజీ, పాల్గొన్నారు. మధురసేనలో పౌరసేవల్లో ఎంపీటీసీ చిక్కం ప్రతిమ, సర్పంచ్ దొమ్మేటి శ్రీదుర్గాచిన్నా పాల్గొన్నారు. మధురసేనలో ఎంపీటీసీ చిక్కం శ్రీరాధాకృష్ణ విరాళంగా ఇచ్చిన స్థలంలో నిర్మించిన ఆర్‌డబ్ల్యుఎస్ వాటర్ ట్యాంకును, చినగాడవిల్లిలో ఆర్బీకే కేంద్రాన్ని, పెద్దాపురం కుల్లూరు, జగ్గన్నపేట ఆర్బీకే, ఎర్రం కమ్యూనిటీ భవనం, ఉప్పలగుప్తంలో ఆర్బీకే కేంద్ర భవనం, మధురసేన టాటా అంబేడ్కర్ భవనం, గొల్లవిల్లి హైస్కూల్‌లో నాబార్డు ఆదర్శ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈకార్యక్రమాల్లో అధికారులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం ఎంపీడీవోగా కొండలరావు

కపిలేశ్వరపురం, మార్చి 2: కపిలేశ్వరపురం ఎంపీడీవోగా ఏఎస్ఆర్ఎస్ కొండలరావు బాధ్యతలు చేపట్టారు. ఏలూరుగోదావరి జిల్లా ఉండి నుంచి ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో ఎంరామకృష్ణారెడ్డి ఉండి వెళ్లారు.

టూరిస్ట్ గార్డులకు వేతనాలు పెంపు

యానాం, మార్చి 2:పర్యాటక కేంద్రాల వద్ద టూరిస్ట్ గార్డులుగా పనిచేస్తున్న వారి వేతనం రూ.10వేల నుంచి రూ.18వేలకు పెంచుతూ ఎండీ కె.మురళీధరన్ ఉత్తర్వులిచ్చారు. 46మంది టూరిస్ట్ గార్డుల వేతనాలు పెరిగాయి. సీగల్స్‌లో ఉన్నఏనిమిది మంది సిబ్బంది సీగల్స్ మేనేజర్ మురళీధరన్‌ను సత్కరించారు.

రాజోలు తహసీల్దార్‌గా గోపాలకృష్ణ

రాజోలు, మార్చి 2: రాజోలు తహసీల్దార్‌గా ఎ.గోపాలకృష్ణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆలమూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎం.పాల్ అమలాపురం ఆర్డీవో కార్యాలయానికి బదిలీ అయ్యారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

మండపేట, మార్చి 2: స్థానిక కాంగ్రెస్ సెంటరులో కాపు ఉద్యమ నాయకుడు వంగవీటి మోహనరంగా, మాజీ ఎమ్మెల్యే వీవీఎస్ఎస్ చౌదరి, జ్యోతిరావుపూలే సతీమణి సావిత్రిబాయి పూలే విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు శనివారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు భూమిపూజచేశారు. కేశవరంలో సీసీ రోడ్లు, నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. కేశవరంలో 345మంది లబ్ధిదారులకు అభివృద్ధి చేసిన జగనన్న లేఅవుట్‌లో స్థలాలు అందించారు. గడపగడపకు కార్యక్రమంలో ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న 108మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ పతివాడ నూకదుర్గారాణి, ఎంపీపీ ఉండమట్ల వాసు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దూలం పద్మవెంకన్న బాబు, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ, వైసీపీ నేతలు రెడ్డి రాజబాబు, కర్రి పాపారాయుడు, వేగుళ్ల పట్టాభి రామయ్యచౌదరి, తోట వెంకటేశ్వరరావు, జన్నూరి సాయిబాబు, వైసీపీ పట్టణ అధ్యక్షుడు ఎం.బాపిరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రపురం, మార్చి 2: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. స్థానిక 28వ వార్డు మేదరవీధిలో శనివారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి అధికారులతో మాట్లాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, వైసీపీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పిల్లి రామకృష్ణ, అల్లిక సత్తిబాబు, బొల్లా కృష్ణ, అన్నాబత్తుల వాజీబాబు, మిండపాపు కృష్ణ, సాధిక్, మడిశెట్టి సూరిబాబు, పిల్లి రామకృష్ణ, చింత శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి జాతర మహోత్సవాలు

ముమ్మిడివరం, మార్చి 2: సీహెచ్ గున్నేపల్లిలోని జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈనెల24 నుంచి ప్రారంభమైన జాతర మహోత్సవాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం సత్తెమ్మతల్లి అమ్మవారి రథంపై ఊరేగించారు. అనంతరం కన్నులు మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పులు సాగాయి. బాణసంచా కాల్పులను వీక్షించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. శుక్రవారం రాత్రి కార్తికేయ ఈవెంట్స్ సినీ గాయని, గాయకుల సంగీత విభావరి విశేషంగా ఆకట్టుకుంది. గాయని గాయకులు సాగర్, ఉదార్, సాహితీ, గాయత్రి, యాంకర్ దీప్తిలు పాటలతో ఉత్తేజ పరిచారు. జనసేన పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు పితాని బాలకృష్ణ సత్తెమ్మతల్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సముద్ర తాబేళ్ల సంరక్షణపై శిక్షణ

కాట్రేనికోన, మార్చి 2: కరుప్పకు లైవ్‌ఫోస్ వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు వినాయక్, అపర్ణ, ఆర్యకామ్‌లు సముద్ర తాబేళ్ల సంరక్షణపై శిక్షణ, అవగాహన కల్పించారు. జిల్లాలో వాసాలతిప్ప ఎస్.యానాం, గచ్చకాయలపోర, కాట్రేనికోన ఐలాండ్‌లో తాబేళ్ల సంరక్షణ హేచరీలను నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఈకేంద్రాల్లో ఫారెస్ట్ హెల్పర్లుగా విధులు నిర్వహిస్తున్న యువకులు, అటవీశాఖ సిబ్బంది శిక్షణలో పాల్గొన్నారు. శిక్షణా కార్యక్రమంలో జిల్లా అటవీశాఖాధికారి ఎంవీ ప్రసాదరావు, అమలాపురం ఎఫ్ఎస్‌వో ఎస్.ఎస్.వీ.ఎస్ హరికుమార్, కోరింగ ఎఫ్ఆర్వో ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు యానాం ఐటీఐలో జాబ్‌మేళా

యానాం, మార్చి 2: స్థానిక నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో ప్రాంగణంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణ తెలిపారు. స్పెరెడ్ ఎలక్ట్రిక్, ఓరియంట్ ఎలక్ట్రానిక్స్ ప్రీమియర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు, జీఆర్ అసోసియేషన్, రుచిత అసోసియేషన్ హైదరాబాద్ ఏజెన్సీలుజాబ్‌మేళాలో పాల్గొంటాయన్నారు. 6వ తరగతి పాస్, 10వ తరగతి ఫెయిల్, పాస్, ఐటీఐ, డిప్లమో ఇన్ ఇంజినీరింగ్, ఇంటర్మీడియట్ అర్హతలు కలిగినవారు ఈమేళాకు హాజరుకావచ్చన్నారు.

గెలుపు కోసం శ్రేణులు పనిచేయాలి

మండపేట, మార్చి 2: వైసీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వైసీపీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేశవరంలో తోట శనివారం ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. మండపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఐదేళ్లలో అభివృద్ధి చేసిన ఘనత తమకే దక్కుతుందన్నారు. కేశవరంలో కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధమని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ దూలం పద్మవెంకన్నబాబు, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ, వైసీపీ నేతలు తోట పృధ్వీరాజ్, కర్రి పాపారాయుడు, రెడ్డి రాధాకృష్ణ, ఎంపీపీ ఎస్ వాసు, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

కె.గంగవరం, మార్చి 2: బ్రహ్మపాలెంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రజలు నిరసన తెలిపారు. గోదావరిచెంతనే ఉన్న గ్రామంలో తాగునీటి కొరత బాధాకరమన్నారు. తాగునీటి సమస్య పరిష్కరించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ రామచంద్రపురం పట్టణ అధ్యక్షుడు ఆర్తి భాన్, పార్టీ కెంగురురం మండల అధ్యక్షుడు డొంగ బాలసుబ్రహ్మణ్యం, కొప్పిశెట్టి రామకృష్ణ, దంగేటి నాగేశ్వరరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నామనకు ప్రముఖుల పరామర్శ

మామిడికుదురు, మార్చి 2: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబుకు పలువురు ప్రముఖులు పరామర్శించారు. రాంబాబు సతీమణి కృష్ణవేణి చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో మాజీ మంత్రులు చినరాజప్ప, గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, చిల్లా జగదీశ్వరి, పిల్లి అనంతలక్ష్మి, నిమ్మకాయల చినరాజప్ప, మాజీ ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు, డొక్కా నాథ్‌బాబు, మోకా ఆనందసాగర్, చెరుకూరి సతీష్, గుత్తుల సాయి, తాడి నరసింహారావు, పెచ్చెట్టి చంద్రమౌళి, నాయకులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో కేసులు నమోదు

రాయవరం, మార్చి 2: దాడిచేసిన ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.సురేష్ శనివారం తెలిపారు. లొల్ల ఇటుకబట్టీలో పనిచేస్తోన్న రామచంద్రపురం మండలం ఉట్రుమిల్లికి చెందిన ఉండ్రాజవరపు వెంకటేశ్వర్లు, ఉండ్రాజవరపు నిత్యానందం మధ్య ఘర్షణ జరిగింది. నిత్యానందం భార్యతోనపై దాడి చేశాడని, అడ్డువచ్చిన తన భార్యపై దాడిచేశాడని వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మాచవరం ఇటుక బట్టీలో పనిచేస్తోన్న కేవలబండ దుర్గా ప్రసాద్‌కు అదే గ్రామానికి చెందిన చోల్లంగి వీరబాబు రూ.2వేలు అప్పాలి. బాకీ అడిగిన దుర్గాప్రసాద్‌పై వీరబాబు దాడి చేశాడు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

లక్ష పసుపు కొమ్ములు నోము

రాజోలు, మార్చి 2: కడలిలో ప్రముఖ పాల్కొమతీశ్వర కంచర కాశీవిశ్వనాథ సన్నిధానం వద్ద గరిశెల దంపతుల ఆధ్వర్యంలో లక్ష పసుపుకొమ్ముల నోమును శనివారం వైభవంగా జరిగింది. పూజా కార్యక్రమంలో కాశీవిశ్వనాథ-సీతామహాలక్ష్మి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాపిరెడ్డి దంపతులు నిర్వహించారు. వేదపండితులు మండప పూజలు, హోమాలు, పూర్ణాహుతి, దశ దానాలు నిర్వహించారు. ఈపూజా కార్యక్రమాన్ని జిల్లా నలుమూలల నుంచి ఆర్యవైశ్యులు పాల్గొని లక్ష పసుపు కొమ్ములను తీసుకున్నారు. 750మంది ముత్తయిదువలకు పసుపుకొమ్ముల వాయనాలు అందజేశారు. కార్యక్రమంలో కంచర్ల వెంకన్నగుప్తా, కాసు శ్రీనివాసు, లక్ష్మిశెట్టి బాబులు, పప్పూ ఉత్తరాయ్య, కంచర్ల కృష్ణమోహన్, పోలిశెట్టి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో దంపతులు పూజలు

అంతర్వేది, మార్చి 2: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అమలాపురం ఆర్డీవో జె.శివరామకృష్ణారెడ్డి దంపతులు కుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతంపలికారు. అంతరాలయంలో స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం అర్చకులు, అధికారులు ఆయన దంపతులకు అందించారు. వీఆర్వో సీతారామ్ పాల్గొన్నారు.